dctelugu.com
డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 28 గురువారం16 సెప్టెంబర్ 2026

## కరీంనగర్ సిటీ సమాచారం

# పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యే

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- విద్యార్థుల ఆకలిని తరిమి.. అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- కరీంనగర్‌లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం
- 49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం



**కరీంనగర్, డీసీ :**
పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.
కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

### విద్యే.. పిల్లలకు గొప్ప ఆస్తి

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.
ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.

### ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు

ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం

కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

### అధునాతన యంత్రాలతో ఆహార తయారీ

కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో, పరిశుభ్రంగా అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ×ూా స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు సకాలంలో అల్పాహారం తరలిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన, సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని, మెనూ రూపకల్పనలో చీ×చీ సహకారం తీసుకున్నామని చెప్పారు.

### వారంలో ఆరు రకాల అల్పాహారం

సోమవారం ఇడ్లీ--సాంబార్, మంగళవారం పూరీ--ఆలూ కుర్మా, బుధవారం దోశ--చట్నీ, గురువారం ఉప్మా--చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ--సాంబార్, శనివారం బోండా--చట్నీ అందిస్తామని మంత్రి వివరించారు. రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందిస్తామని తెలిపారు.

### కోడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్..

2024 డిసెంబర్‌లో కోడంగల్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించామని చెప్పారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడినట్లు, ఆలస్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. కోడంగల్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

### రాష్ట్రవ్యాప్తంగా 17.72 లక్షల మంది విద్యార్థులకు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు. 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష, 10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.

### హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ధన్యవాదాలు

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్

➤ మిగతా 2వ పేజిలో..

# వినాయక నిమజ్జనోత్సవాన్ని బ్రహ్మాండంగా నిర్వహిస్తాం

- గత ఇబ్బందులు పునరావృతం కాకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- పక్కా ప్రణాళికతో ముందుకు..
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి..
- నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలి..
- ప్రజలు శభాష్ అనేలా విధులు నిర్వర్తించాలి.
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లిలో వినాయక నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్ల పరిశీలన..
- ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దిశానిర్దేశం



**కరీంనగర్ డీసీ :**
కరీంనగర్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న వినాయక నిమజ్జనోత్సవాన్ని బ్రహ్మాండంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. గతంలో నిమజ్జన సమయంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, లైటింగ్, భారీ క్రేన్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం రాత్రి మానకొండూరు, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను కేంద్ర మంత్రి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం,

➤ మిగతా 2వ పేజిలో..



# పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యే

**మొదటిపేజీ తరువాయి..**
ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జూ= నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.
గతంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఇదే ఫౌండేషన్ ద్వారా కరీంనగర్‌లో ఆలయం నిర్మించాలని అనుకున్నామని, ఆ అంశం ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని చెప్పారు. మళ్లీ ఫౌండేషన్‌తో కలిసి ఆ దిశగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను కూడా హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విజిలెన్స్ విచారణ పూర్తయిందని, కళాశాలలకు రావాల్సిన బకాయిలను విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.

### విద్యార్థులతో కలిసి అల్పాహారం

సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరు, ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల్లేవు..
# స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో అన్నదానం

**పర్యావరణ పరిరక్షణకు వినూత్న సందేశం..**

**5వ వార్డులో కౌన్సిలర్ గుజ్జుల కుమార్ ఆధ్వర్యంలో నిత్య అన్నదానం**

పెద్దపల్లి డీసీ

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని 5వ వార్డులో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న సందేశాన్ని అందించారు.
సాధారణంగా అన్నదాన కార్యక్రమాల్లో ఉపయోగించే పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను వినియోగిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు."పేపర్ ప్లేట్లు,ప్లాస్టిక్ గ్లాసులు వద్దు.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో 5వ వార్డు కౌన్సిలర్ గుజ్జుల కుమార్ ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టారు. వినాయక చవితి సందర్భంగా భక్తులకు ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తూ,అదే సమయంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు.అన్నదాన కార్యక్రమానికి వచ్చే భక్తులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందించి భోజనం వడ్డించారు. భోజనం అనంతరం వాటిని సేకరించి శుభ్రపరిచి తిరిగి వినియోగించే విధంగా ఏర్పాట్లు చేశారు. దీంతో పెద్ద మొత్తంలో పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకున్నారు.వినాయక చవితి ఉత్సవాల్లో భక్తి కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఒక్కసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్,పేపర్ ప్లేట్ల వల్ల కలిగే వ్యర్థాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ పునర్వినియోగ వస్తువులను ఉపయోగించాలని సూచించారు.వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.పెద్దపల్లి 5వ వార్డులో నిర్వహించిన ఈ వినూత్న అన్నదాన కార్యక్రమం భక్తులను ఆకట్టుకోవడంతో పాటు, పర్యావరణ పరిరక్షణపై చర్చకు దారితీసింది. అన్నదానం చేస్తూనే పర్యావరణాన్ని కాపాడే మార్గాన్ని చూపించిన కౌన్సిలర్ గుజ్జుల కుమార్ ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

# వినాయక నిమజ్జనోత్సవాన్ని బ్రహ్మాండంగా నిర్వహిస్తాం

**మొదటిపేజీ తరువాయి..** మేయర్ కొలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ ఆర్డీవో షర్మిలతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. **నిమజ్జన ప్రాంతాలకు అవసరమైన నీరు**
కరీంనగర్‌లోని గణనీయ సంఖ్యలో వినాయక విగ్రహాలు మానకొండూరు చెరువు, చింతకుంట కాకతీయ కెనాల్, కొత్తపల్లి ప్రాంతాల్లో నిమజ్జనం కానున్న నేపథ్యంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బండి సంజయ్ తెలిపారు.
మానకొండూరు చెరువుతో పాటు చింతకుంట కాకతీయ కెనాల్, కొత్తపల్లి ప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన నీటిని విడుదల చేయాలని సాగునీటి శాఖ మంత్రి, ఉన్నతాధికారులను కోరినట్లు ఆయన చెప్పారు. నిమజ్జనోత్సవ సమయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

### భారీ క్రేన్లు.. జాలర్లు సిద్ధం చేయాలి

నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సంఖ్యలో భారీ క్రేన్లు, జాలర్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనం సురక్షితంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.
కరీంనగర్‌లోని సుమారు 50 శాతం వినాయక విగ్రహాలు మానకొండూరు చెరువు వద్ద నిమజ్జనం కానున్నందున అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

### భక్తులకు అన్ని సౌకర్యాలు

నిమజ్జనోత్సవానికి వచ్చే భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, నిమజ్జన ప్రాంతాల్లో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. పరిసరాలను ముందుగానే పరిశుభ్రంగా మార్చి చెత్తాచెదారం, పొదలు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. భక్తులు, ప్రజలు రాత్రివేళల్లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా అవసరమైన వెలుతురు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు.

### విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. విద్యుత్ లైన్లు, లైటింగ్ వ్యవస్థలను ముందుగానే పరిశీలించి భద్రతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు.

### ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

వినాయక శోభాయాత్రలు, నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అన్నారు. ప్రయాణికులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ముందుగానే ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు చర్యలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు.

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

వినాయక నిమజ్జనోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్, సాగునీటి, విద్యుత్, ఆర్అండ్‌బీ, మైనింగ్, రెవెన్యూ, నగరపాలక సంస్థ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని బండి సంజయ్ ఆదేశించారు. నిమజ్జనానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులకు అవకాశం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. భారీ క్రేన్లను ఏర్పాటు చేయాలని సంబంధిత మరమ్మత్తు చేసే ఆపరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ తరఫున గతంతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో నిమజ్జనోత్సవ ఏర్పాట్లకు నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

### గత సమస్యలకు చెక్.. ప్రశాంతంగా నిమజ్జనం

గతంలో నిమజ్జన సమయంలో ఎదురైన సమస్యలను అధిగమిస్తూ ఈసారి మరింత సమర్థవంతంగా ఏర్పాట్లు చేస్తున్నామని బండి సంజయ్ అన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. "గతంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయో వాటిని దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. వినాయక నిమజ్జనోత్సవాన్ని బ్రహ్మాండంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ ఆర్డీవో షర్మిలతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతో అధిక దిగుబడి..
# ఉద్యాన శాఖ రాయితీలతో రైతులకు అదనపు ఆదాయం

**సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూరగాయల సాగుకు రైతులు ముందుకు రావాలి:**

**జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్**

పెద్దపల్లి డీసీ :
పెద్దపల్లి మండలంలోని వివిధ కూరగాయల సాగు క్షేత్రాలను జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ ఈరోజు సందర్శించి, కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, అధిక దిగుబడులు, ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా రైతు శ్రీ పూడారి చంద్రశేఖర్ సాగు చేస్తున్న గ్రాఫ్టెడ్ టమాటా, వంకాయ పంటలను పరిశీలించారు. ఈ పంటలు అధిక దిగుబడినిస్తూ పెద్దపల్లి మార్కెట్‌లో మంచి ధరలు లభించడంతో రైతుకు మంచి ఆదాయం వస్తోందని తెలిపారు.
అలాగే వెదురు కర్రలను ఆధారంగా చేసుకుని సాగు చేస్తున్న కాకరకాయ పంటను పరిశీలించారు. కూరగాయల సాగులో ఆధార కర్రల ఏర్పాటుకు ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ.10,000 వరకు రాయితీ, శాశ్వత పందిళ్ల నిర్మాణానికి హెక్టారుకు రూ.1.00 లక్ష వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.
మల్చింగ్ షీట్‌కు హెక్టారుకు రూ.20,000 వరకు రాయితీతో పాటు టమాటా, మిరప, వంకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికమ్ తదితర కూరగాయల నాణ్యమైన నాట్లను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. పంటల అంతర కృషి పనుల కోసం మినీ ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లు వంటి వ్యవసాయ యంత్రాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు.
ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ కూరగాయల సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.
ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉద్యాన శాఖ అందిస్తున్న వివిధ రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి కోరారు.
ఈ కార్యక్రమంలో రైతులు శ్రీ పూడారి చంద్రశేఖర్, శ్రీ రమేష్, శ్రీ శ్రీనివాస్, ఉద్యాన విస్తరణ అధికారులు బి. రాము, బి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

